క్లుప్తంగా

అభయాంజనేయస్వామికి ఏకాంత సేవ



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు అభయాంజనేయస్వామి ఆలయంలో 16 రోజుల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ క్రమంలో ఆదివారం 16 రోజుల వేడుక సందర్భంగా స్వామి వారికి ఏకాంత సేవ, పానుపు ఉత్సవం జరిపించారు. తొలుత భక్తి గీతాలతో ఏర్పాటు చేసిన భజనా కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమం అనంతరం గ్రామ మహిళలు, పురుషులు కలిసి ప్రదర్శించిన కోటాటం ఆద్యంతం ఆహూతులను అలరించింది.

భక్తి శ్రద్ధలతో గ్రామోత్సవం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

రాచర్ల: మండలంలోని యడవల్లి గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మోహిని అవతారంలో స్వామివారి గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారిని అర్చకులైన కందనూరి హరీష్‌కుమార్, కందనూరి పార్థసారిథి, నంద్యాల శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో మోహినిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్త మార్కాపురం సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరించిన టీచర్లు



కొమరోలు ఎమ్మార్సీలో ఖాళీగా ఎంఈఓ వెంకటరత్నం, సిబ్బంది

కొమరోలు: మండలంలోని ఎంపీపీ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ ఆదివారం మొదలైంది. రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరూ మాన్యువల్ రూపంలో ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఉన్నతాధికారులకు విన్నవించారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వెబ్ కౌన్సెలింగ్ చేపట్టింది. దీంతో కొమరోలు మండలంలో బదిలీలకు అర్హత కలిగిన 47 మంది ఎస్జీటీలు యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వెబ్ కౌన్సెలింగ్‌ను బహిష్కరించారు. స్థానిక ఎమ్మార్సీకి ఒక్క ఉపాధ్యాయుడు కూడా హాజరు కాకపోవడంతో ఎంఈఓ వెంకటరత్నం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, కంప్యూటర్ డేటా ఆపరేటర్ రవీంద్రరెడ్డి ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది.

పోలేరమ్మకు పొంగళ్లు

కొనకనమిట్ల: మండలంలోని చినమనగుండం గ్రామంలో ఆదివారం సాయంత్రం గ్రామ దేవత పోలేరమ్మతల్లి, బొడ్డురాయికి అత్యంత భక్తిశ్రద్ధలతో ఉత్సవం నిర్వహించారు. గ్రామంలో 40 రోజుల క్రితం నూతన పోలేరమ్మ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ నేపథ్యంలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోలేరమ్మ తల్లికి నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామం పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఎంసెట్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ఈఏపీసెట్–2025 పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీ సరస్వతి విద్యాసంస్థలు, శ్రీ ప్రతిభ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. శ్రీ సరస్వతి విద్యాసంస్థలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఆర్.సుకుమార్‌సాయి 625వ ర్యాంకు, కె.లోకక్రితీ 897వ ర్యాంకు, గుణశేఖరరెడ్డి 935వ ర్యాంకు, ఇంద్రసేనారెడ్డి 1044వ ర్యాంకు, హర్షిణి 1186వ ర్యాంకు, ఝాన్సీలక్ష్మి 1540వ ర్యాంకు, సాయిమణికంఠారెడ్డి 1638వ ర్యాంకు, ఎనోష్‌రాయ్ 1650వ ర్యాంకు, వెస్లీ సాగర్ 1735వ ర్యాంకు సాధించినట్లు చైర్మన్ ఎ.వి.రమణారెడ్డి తెలిపారు. అంతేగాకుండా వెయ్యిలోపు ర్యాంకులను ముగ్గురు, రెండు వేలలోపు ర్యాంకులను 9 మంది, ఐదు వేలలోపు ర్యాంకులను 24 మంది, పది వేల లోపు ర్యాంకులను 56 మంది సాధించినట్లు వివరించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రమణారెడ్డితో పాటు డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరరెడ్డి, సీఈఓ ఎస్.వి.సురేష్, డీన్లు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

శ్రీ ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు...

శ్రీ ప్రతిభ విద్యాసంస్థలకు చెందిన పది మంది విద్యార్థులు ఏపీ ఈఏపీసెట్–2025లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీ ప్రతిభ విద్యార్థిని బత్తిన స్వాతి 1071వ ర్యాంకు, కాకర్ల మణిచంద్ 2807వ ర్యాంకు,



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

పోటు విష్ణు 3,376వ ర్యాంకు, కుమ్మర వెంకట కళ్యాణ్‌రామ్ 3875వ



కె.లోకక్రితీ (897వ ర్యాంకు)



కె.గుణశేఖర్‌రెడ్డి (935వ ర్యాంకు)

ర్యాంకు, పి.వెంకట పవన్ 5602వ ర్యాంకు, దొండపాటి స్నేహరెడ్డి 5664వ ర్యాంకు, బత్తిన చరణ్‌తేజ 5838వ ర్యాంకు, వి.శ్రీసాయిచందన 6155వ ర్యాంకు, పాలెం గణేష్‌రెడ్డి 6716వ ర్యాంకు, నాగినేని లక్ష్మీ దీపిక 7558వ ర్యాంకు సాధించినట్లు చైర్మన్ వివరించారు. ఐదు వేల లోపు ర్యాంకులు నలుగురు, పది వేల లోపు ర్యాంకులు 13 మంది, 15 వేలలోపు ర్యాంకులు 38 మంది, 20 వేలలోపు ర్యాంకులు 64 మంది, 25 వేలలోపు ర్యాంకులు 85 మంది, 30 వేల లోపు ర్యాంకులు 125 మంది, 35 వేల లోపు ర్యాంకులు 187 మంది సాధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారికి బోధించిన అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ జయప్రకాష్‌నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు...

శ్రీ చైతన్య విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఇంజినీరింగ్ విభాగంలో ఎం.సౌమ్యశ్రీ 426వ ర్యాంకు, విజయవర్ష 2,990వ ర్యాంకు, సాహితీ 3270వ ర్యాంకు, కృష్ణసాయి 4579వ ర్యాంకు సాధించినట్లు బ్రాంచ్ డీన్ రామకృష్ణ తెలిపారు. మెడికల్ విభాగంలో లలిత విజయకుమారి చౌదరి 4,876వ ర్యాంకు సాధించినట్లు చెప్పారు. ఒంగోలు నగరానికి చెందిన రాజు వెంకట హాసిని ఎంసెట్‌లో రాష్ట్రస్థాయిలో 292వ ర్యాంకు సాధించింది. హాసిని తండ్రి కృష్ణారెడ్డి జలవనరుల శాఖలో ఉద్యోగి కాగా, తల్లి జ్యోతి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



పాల్గొన్న భక్తులు

- వేడుకగా తిరువీధి ఉత్సవం
- ముగిసిన శ్రీగిరి బ్రహ్మోత్సవాలు

ఒంగోలు మెట్రో: శ్రీగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం వైఖానస ఆగమ పండితుడు పరాంకుశం సీతారామాచార్యులు బృందం శ్రీవారి కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించింది. దంపతులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, శ్రీగిరి దేవస్థానం అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో నేత్రపర్వంగా కళ్యాణం జరిగింది. సాయంత్రం శ్రీవారి తిరువీధి ఉత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ వాసవీ భజన మండలి కళాకారులు కోలాట ప్రదర్శనతో భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త



స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ్ రాజీవ్, ఆలూరు జై శంకర్ తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైఎస్సార్ సీపీ నాయకునికి బూచేపల్లి, మేరుగు నివాళులు

చీమకుర్తి రూరల్: మండలంలోని పులికొండ గ్రామంలో వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం మండల అధ్యక్షుడు సాదినేని వెంకటరావు తండ్రి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సాదినేని సుబ్బారావు (61) శనివారం రాత్రి హఠాత్తుగా గుండెపోటుతో మృతిచెందారు. ఆయనకు ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ సంతనూతలపాడు ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు,



నివాళులర్పిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మేరుగు నాగార్జున

వైస్ ఎంపీపీ రావి లక్ష్మయ్య, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, సర్పంచ్ మక్కెన రాజేంద్ర కుమార్, మండల ఉపాధ్యక్షుడు చీదర్ల శేషు, మూలె రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

12న మాక్ వెబ్ కౌన్సెలింగ్

ఒంగోలు సిటీ: ఇంజినీరింగ్, మెడిసిన్‌లో ప్రవేశాల కోసం వెబ్ కౌన్సెలింగ్‌కు హాజరుకానున్న విద్యార్థులకు ఒంగోలు బ్రిలియంట్ కంప్యూటర్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఒంగోలులోని గుంటూరు రోడ్డులో గల ఏ–1 ఫంక్షన్ హాల్లో ప్రత్యేక మాక్ వెబ్ కౌన్సెలింగ్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ సంస్థల అధినేత డాక్టర్ న్యామతుల్లాబాషా తెలిపారు. ఆదివారం బ్రిలియంట్ సంస్థలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. భారీ ఎత్తున నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, రిటైర్డ్ డి.జి.పి కె.ఆర్.ఎం.కిషోర్ కుమార్, ప్రముఖ యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కాలేజీలు, డిగ్రీ కాలేజీలు, హోటల్ మేనేజ్మెంట్ కాలేజీలు, మొదలగు వాటి నుంచి వైస్ చాన్సలర్లు, ప్రొఫెసర్లు, ప్రిన్సిపాళ్లు, చైర్మన్లు పాల్గొని స్టూడెంట్స్ కెరీర్ గైడెన్స్‌కు అవసరమైన అమూల్యమైన విషయాలపై అవగాహన కలిగిస్తారని తెలిపారు. దేశంలోనే పేరున్న ఇంజినీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీలు తమ విద్యా సంస్థల స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాయని, వాటి ద్వారా స్టూడెంట్స్‌కు కావాల్సిన సమాచారాన్ని అందిస్తారని తెలిపారు. సదస్సుకు హాజరయ్యే స్టూడెంట్స్‌కు ఉచిత భోజనంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి



మాట్లాడుతున్న బ్రిలియంట్ సంస్థల అధినేత డాక్టర్ న్యామతుల్లాబాషా

నట్లు తెలిపారు. ఈ సంవత్సరం సదస్సులో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు సబ్సిడీతో కూడిన ఎడ్యుకేషన్ లోన్లు మంజూరు చేయడం గురించి బ్యాంకు అధికారులు తెలియజేస్తారని తెలిపారు. పాల్గొన్న విద్యార్థులకు లక్కీ డ్రా ద్వారా ఇద్దరికి ల్యాప్‌టాప్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ల్యాప్‌టాప్ లక్కీడిప్ కూపన్ల కోసం, ఉచిత బస్‌పాస్, ఇతర వివరాల కోసం ఒంగోలు అంజయ్య రోడ్డులోని బ్రిలియంట్ ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించాలని తెలిపారు. ప్రవేశం ఉచితమని చెప్పారు. విలేకరుల సమావేశంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తహూర, కోర్స్ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ అకిల్, ఈవెంట్ మేనేజర్ నాగార్జున పాల్గొన్నారు.

యోగాభ్యాసంతో మానసిక వికాసం

- కొత్తపట్నం బీచ్‌లో యోగా కార్యక్రమం

కొత్తపట్నం: భారతీయ వారసత్వ సంపదైన యోగాభ్యాసంతో మానసిక వికాసం, ఆరోగ్య జీవన విధానం సొంతమవుతుందని, సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాల్ కృష్ణ అన్నారు. కొత్తపట్నం బీచ్ ప్రాంతంలో ఆదివారం యోగాంధ్ర–2025లో భాగంగా ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొత్తపట్నం ఇన్‌చార్జి తహసీల్దార్ పి.మధుసూదన్‌రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఆంధ్ర సాకారం దిశగా వడి వడిగా అడుగులేస్తూ ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకుంటోందన్నారు. భారతీయ వారసత్వ సంపద అయిన యోగా విశిష్టతను గుర్తించి ఐక్యరాజ్య సమితి 2014న జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈ ఏడాది జూన్ 21వ తేదీ నుంచి నెల రోజుల పాటు యోగాంధ్ర క్యాంపెయిన్‌ను రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేసేందుకు పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టడంతో పాటు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యోగా శిక్షణ కార్యక్రమాలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటికే మల్లవరం, త్రిపురాంతకం పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు



కొత్తపట్నం బీచ్‌లో యోగా చేస్తున్న జేసీ గోపాల్ కృష్ణ, అధికారులు

నిర్వహించామన్నారు. ఈ నెల 15వ తేదీ ఆదివారం సింగరాయకొండ మండలం పాకల బీచ్‌లో ప్రత్యేక యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 20వ తేదీ సుమారు పదివేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని చేపడతామన్నారు. జిల్లాలో కనీసం పది లక్షల మందిని భాగస్వాములు చేసే లక్ష్యంతో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రత్యేక యోగా ట్రైనర్లతో పెద్ద ఎత్తున యోగాసనాల శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, డీపీవో వెంకటరాయుడు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ డీడీ రవి కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, సెర్ప్ సీఈవో శ్రీమన్నారాయణ, ఎంపీడీవో శ్రీకృష్ణ, రెండోవ పట్టణ సీఐ మేడా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సమతుల్యతతోనే భూమికి ఆరోగ్యం

చీమకుర్తి రూరల్: మండలంలోని పడమటినాయుడు పాలెం, కేవీ పాలెం, చీమకుర్తి గ్రామాల్లో ప్రీ ఖరీఫ్‌పై ఆదివారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డే నోడల్ ఆఫీసర్ టి.మానస పాల్గొని ఎరువుల సమతుల్యతతోనే భూమి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ రైతులు ముఖ్యంగా సాగు ఖర్చులు తగ్గించుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. సాంకేతిక యాజమాన్య పద్ధతులు పాటించడంపై రైతులు పోటీపడాలన్నారు. పంటలకు అధికంగా ఎరువుల వినియోగం మంచిది కాదన్నారు. సేంద్రియ ఎరువులకు బదులుగా ఎక్కువగా రసాయన ఎరువులు వినియోగిస్తూ భూసారాన్ని క్షీణింపజేస్తున్నారని తెలిపారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి రైతుపై ఉందన్నారు. ప్రతి ఒక్క రైతు ఖరీఫ్ సాగుకు ముందే భూసార పరీక్షలు చేయించుకుని భూసార పత్రాల ఆధారంగా ఎరువులు వాడుకోవాలని సూచించారు. ఒకే మందును ఒకే పంటకు వేయడం వలన తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తాయన్నారు. తెగుళ్లకు కారకాలైన పురుగులు వ్యాధి



ప్రీ ఖరీఫ్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

నిరోధక సామర్థ్యాన్ని పెంచుకుంటాయని వివరించారు. అందువలన పంటమార్పిడి విధానాలను అనుసరిస్తూ అవసరం మేరకే పురుగు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. తద్వారా ఖర్చులు తగ్గి రైతులు లాభాలతో పాటు భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి భాస్కర్, బి.ధనలక్ష్మి, ఏఈఓ, వీఏఏ, వివిధ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు

ఒంగోలు వన్‌టౌన్: కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని ఐఎల్‌పీ పార్టీ అధ్యక్షుడు దాసరి సుందరరావు అన్నారు. స్థానిక మంగమూరు రోడ్డులోని మూడు బొమ్మల సెంటర్ వద్ద ఆదివారం అంబేడ్కర్ యువజన సంఘం ప్రథమ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గంలో మాలపల్లెను అక్కడి అగ్రకులస్తులు బహిష్కరిస్తే.. కనీసం ఎవరూ పరామర్శించలేదన్నారు. దళిత బహుజనుల ఓట్లతో గెలిచిన ముఖ్యమంత్రి కూడా దళితులపై దాడులను ఆపడానికి శ్రద్ధ వహించడంలేదన్నారు. తిరుపతి జిల్లాలో మాదిగలను అక్కడి కమ్మ అహంకారులు సాంఘిక బహిష్కరణ చేస్తే ఎటువంటి చర్యలు



నినాదాలు చేస్తున్న దాసరి సుందరరావు, తదితరులు

అధికారులు తీసుకోలేదన్నారు. తెనాలి సంఘటనలో కూడా దళితులను అత్యంత పాశవికంగా నడిరోడ్డుపై పోలీసులు హింసించడం ప్రభుత్వ పెద్దలకు తెలిసే జరుగుతోందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కట్టా వరప్రసాద్ మాట్లాడుతూ 20 వేలకు పైగా ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి పాలకులు మరిచిపోయారన్నారు. కార్యక్రమంలో కటికాల కార్తిక్, ఎం.రాజేష్, ఎం.అనుదీప్, దాసరి సుందరం, దాసరి సంగీతరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా సత్సంగం వార్షికోత్సవం

చీమకుర్తి రూరల్: మండలంలోని పల్లామల్లి గ్రామంలో సాయిబాబా సత్సంగం 27వ వార్షికోత్సవాన్ని కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సాయిబాబా, శ్రీ బాబూజీ చిత్రపటాలతో కనుల పండువగా గ్రామోత్సవం జరిగింది. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన గురుబంధువులు, భక్తులు, గ్రామ ప్రజలు సాయిబాబా, బాబూజీలకు పూజలు చేశారు.



వేడుకల్లో నృత్యాలతో అలరిస్తున్న చిన్నారులు

విద్యార్థులు యూపీఎస్సీలో సత్తా చాటాలి



పదో తరగతి విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఐఆర్‌ఎస్ అధికారి రమేష్

- ఐఆర్‌ఎస్ అధికారి గోసు రమేష్ పిలుపు

ఒంగోలు వన్‌టౌన్: విద్యార్థులు చిన్నతనం నుంచే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని యూపీఎస్సీ పోటీ పరీక్షల్లో సత్తా చాటాలని ఐఆర్‌ఎస్ అధికారి గోసు రమేష్ పిలుపునిచ్చారు. ఎస్ఎస్‌సీలో 500 మార్కులకుపైగా సాధించిన యాదవ విద్యార్థులకు జై శ్రీకృష్ణ బీసీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఒంగోలు నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ పెరుగు మురళీకృష్ణ యాదవ్ అధ్యక్షత వహించగా, ఐఆర్‌ఎస్ అధికారి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో అభివృద్ధి చెందాలంటే ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించాలన్నారు. అదేవిధంగా వ్యాపారవేత్తలుగా కూడా ఎదిగి పది మందికి ఉద్యోగాలు కల్పించే విధంగా అభివృద్ధి చెందాలన్నారు. ఇప్పటి నుంచే అందుకు అవసరమైన ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ డీడీ రోహిణి మాట్లాడుతూ 10వ తరగతి పాసైన విద్యార్థులు మరో ఐదు సంవత్సరాల పాటు విద్యపైనే దృష్టి సారించాలన్నారు. సమితి వ్యవస్థాపకుడు వి.కృష్ణారావు మాట్లాడుతూ పేద విద్యార్థులను తమ సంస్థ తరపున అనేక విధాలుగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవికిరణ్ యాదవ్, డాక్టర్ పిచ్చయ్య యాదవ్, బంకా చిరంజీవి, డాక్టర్ మాల్యాద్రి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదు



బేస్తవారిపేటలో పార్టీ నేతలతో మాట్లాడుతున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 11వ తేదీన పొదిలి వస్తున్నట్లు ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఎంపీపీ నివాసంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. పొదిలి పొగాకు బోర్డులో రైతుల సాధక బాధలను వైఎస్ జగన్ తెలుసుకుంటారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించలేదన్నారు. అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టాలు వచ్చాయని తెలిపారు. రైతులకు అండగా నిలిచేందుకు, మొద్దు నిద్ర నుంచి కూటమి ప్రభుత్వాన్ని మేల్కొలిపేందుకు వస్తున్న వైఎస్ జగన్‌కు రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు మద్దతు తెలిపి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నా భాస్కర్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షులు మల్లెల శేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు డి.జామీయా, నాయకులు పి.ఈశ్వర్‌రెడ్డి, కొండా రఘునాథరెడ్డి, బొంతల లక్ష్మణస్వామి గుప్తా, గంజి ప్రసాద్, ఎల్ఐసీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.